బీఆర్ఎస్ గ్రామ కమిటీ

బారెగూడలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు

బెజ్జూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని బారెగూడలో ఆదివారం బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రత్నం తరుణ్, ఉపాధ్యక్షుడిగా కండి రాజేశ్‌తో పాటు, ఎనిమిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కార్యదర్శి కొడిశం శంకర్, పోతెపల్లి యూత్ అధ్యక్షుడు జాడి నాందేవ్, నాయకులు రత్నం రుంగుబాయి, దుర్గం శ్యాంరావ్, తలండి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సన్మానం

ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నస్పూర్ రెడ్డి సంఘం నాయకులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 2 : నస్పూర్ మున్సిపాలిటీ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ కెడిక ప్రకాశ్‌రెడ్డిని ఆదివారం నస్పూర్ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోతె రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు అనుమాండ్ల వెంకట్‌రెడ్డి, సలహాదారు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కోశాధికారి చెరుకు చంద్రశేఖర్‌రెడ్డి, నోముల నరేందర్‌రెడ్డి, ఆళ్ల రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణును మాల మహానాడు సంఘం నాయకులు సన్మానించారు. సంఘం నాయకులు గోశిక మనోజ్‌కుమార్, సారంగుల శైలజ, దోనిపల్లి లింగయ్య, నందయ్య, కొంపల్లి పోశం, బోండ మోహన్, బాబురావు, పంగుడ శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బత్తుల వెంకటస్వామి, కోడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గానికి మొండిచేయి

తిర్యాణి, ఫిబ్రవరి 2 : కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం రాష్ట్రంలోని కార్మిక, కర్షక వర్గాలకు మొండిచేయి చూపిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.63 వేల కోట్లు మాత్రమే కేటాయించడం, అదనంగా పెంచకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఏడాదికి రూ.200 పెంచుతూ రోజు కూలీ రూ.600 ఇవ్వాలని దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా ప్రధానమంత్రి మోదీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ బడ్జెట్ ద్వారా ఉపాధి హామీ రంగాన్ని ఎంత చిన్నచూపు చూస్తుందో అర్థమవుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడంలోనూ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపుపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపారని విమర్శించారు.

రెబ్బెన, ఫిబ్రవరి 2 : కేంద్ర బడ్జెట్ లో కార్మిక, కర్షక వర్గాలు, తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని బోగే ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిళ్ల నర్సయ్య ఆరోపించారు. గోలేటిలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ చాలా వర్గాలను నిరుత్సహపర్చిందనానరు. ఏఐటీయుసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ సాగర్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జాడి సాయి, రాజశేఖర్ తదితరులున్నారు.

మానసిక రోగికి మరో జన్మ

- ఎర్రగడ్డ దవాఖాన నుంచి ఇంటికి వచ్చిన దౌలత్

సిర్పూర్(యూ), జనవరి 2 : మానసిక స్థితి బాగోలేక రోడ్లపై తిరుగుతూ కనిపించిన మండల కేంద్రంలోని ప్రెసిడెంటుగూడకు చెందిన దుర్వ దౌలత్ రావ్(20).. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ దవాఖానలో చికిత్స పొంది కోలుకొని ఆదివారం ఇంటికి తిరిగివచ్చాడు. వివరాల్లోకివెళితే.. దౌలత్‌రావ్ మానసికస్థితి బాగోలేక రోడ్లపై తిరుగుతుండేవాడు. రెండు నెలల క్రితం విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఎర్రగడ్డ దవాఖానలో చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. యువకుడు పూర్తిగా కోలుకొని ఇంటికి రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే 38వ జాతీయ స్థాయి క్రీడలకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి కీర్తన, దీప్తి, వెంకటేశ్ ఎంపికైనట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ ఆదివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఆదివారం తన కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బీ తిరుపతితో కలిసి సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరుగనున్న జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గోండి బాషా దినోత్సవం

బెజ్జూర్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివారం ఆదివాసీనాయకుల ఆధ్వర్యంలో గోండు బాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రాయ్‌సెంటర్ సర్‌మేడీ కొడప శంకర్ మాట్లాడుతూ.. పూర్వీకుల నుంచి గోండి బాషీ ఆదివాసులకు సంక్రమించిందన్నారు. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సిడాం సకారాం, పుల్లయ్య, బక్కయ్య, శంకర్, తుకారాం, శ్రీదేవి, పద్మ, లక్ష్మి, సరోజ, అమృత తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత లడ్డసాయి లెవెన్ జట్టు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 2 : సీసీసీ నస్పూర్‌లో దండు మొగిలి స్మార్థార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగింది. ఆదివారం నాగార్జునకాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియంలో పోటీలను మొగిలి కుటుంబ సభ్యులు ప్రారంభించారు. నాలుగు జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో బాబురావు జట్టుపై లడ్డసాయి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.5 వేలు, రన్నర్స్‌కు రూ.వెయ్యితో పాటు, షీల్డ్‌లు అందించారు.

చిరుత సంచారం

చిరుతపులి పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు

తిర్యాణి, ఫిబ్రవరి 2: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో ఇర్కపల్లిలో చిరుతపులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి చింతపల్లి అటవీ ప్రాంతంలో చిరుతపులి చెట్టు ఎక్కిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. అటవీ అధికారులు అప్రమత్తమై తిర్యాణి ఎఫ్ఆర్వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రేంజ్ పరిధిలోని నాయకపుగూడ, ఇర్కపల్లి, చింతపల్లితో పాటు సమీప గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చింతపల్లి, ఇర్కపల్లి గ్రామాల అటవీ ప్రాంతం సమీపంలోని గురుకుల పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో చిరుతపులి పాదముద్రలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, ఎలాంటి హాని తలపెట్టవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో భీమ్లానాయక్, ఎఫ్బీవో అంబారావు, వాచర్ మహాపతిరావు పాల్గొన్నట్లు తెలిపారు.

వేతన వెతలు

1962 సంచార పశువైద్యశాల

జీతాలు అందక ఇబ్బందుల్లో 1962 ఆంబులెన్స్ సిబ్బంది

- ఆరు నెలలుగా నిలిచిన వేతనాలు
- సమ్మెకు సిద్ధమవుతున్న సిబ్బంది
- వాహనాలు మూలనపడే పరిస్థితి

సంచార పశు వైద్యం పడకేసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు పశు వైద్యం మరింత చేరువ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 సంచార పశు వైద్య సేవ.. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో కుంటుపడుతున్నది. పట్టింపులేని ప్రభుత్వం ఐదు నెలలుగా వేతనాలు అందించకుండా 36 మంది వైద్య సిబ్బందిని ఆగంజేసింది. సమ్మె సైరన్ మోగించేందుకు సిద్ధమవుతున్నారంటే వారి పరిస్థితి ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతున్నది. ఈ క్రమంలో అంబులెన్స్‌లు మూలనపడే పరిస్థితి దాపురించింది. - కోటపల్లి, ఫిబ్రవరి 2

గ్రామీణ ప్రాంత ప్రజలకు పశు వైద్యం మరింత చేరువ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం 1962 సంచార పశువైద్య అంబులెన్సులను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా నియోజకవర్గానికో అంబులెన్స్‌తో పాటు, డాక్టర్, టెక్నీషియన్, కెప్టెన్, అటెండర్‌ను కూడా నియమించింది. పశువులు రోగాలబారిన పడితే పశువుల వద్దకే దవాఖానం వెళ్లేలా ఈ వాహనాన్ని రూపొందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9 వాహనాలుండగా, సుమారు 36 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ వాహనాలు ఎన్నో పశువుల ప్రాణాలను కాపాడుతుండగా, ప్రస్తుత ప్రభుత్వం వీటి నిర్వహణపై చిన్నచూపు చూస్తున్నది. ఐదు నెలలుగా వేతనాలు నిలిపివేసింది. వాహనాల్లో మందుల కొరత ఉన్నా, సిబ్బంది వైద్యం అందిస్తున్నారు. కానీ, వేతనాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు తెచ్చి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఆర్థికభారంతో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. చేసేది లేక సమ్మె సైరన్ మోగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే జరిగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అంబులెన్స్‌లన్నీ మూలనపడడంతో పాటు, పశువైద్యానికి గడ్డు కాలం వస్తుంది.

వేతనాలు చెల్లించాలి..

గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న 1962 సంచార పశువైద్యశాల సిబ్బందికి వేతనాలు వెంటనే విడుదల చేయాలి. ఐదు నెలలుగా వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. వేతనాల చెల్లింపులో జాప్యం విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినం. పశువైద్యశాల సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

- పీ సౌమ్య, డాక్టర్, సిర్పూర్ కాగజ్‌నగర్

ఇబ్బందులు పడుతున్నాం..

గత 5 నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మందుల కొరతతో ఇప్పటి వరకు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్న మాకు వేతనాల్లో తీవ్ర జాప్యం కారణంగా అప్పులు తెచ్చి కుటుంబాలను నెట్టుకువచ్చే పరిస్థితి దాపురించింది. పరిస్థితి ఇలానే కొనసాగితే సమ్మెబాట పట్టక తప్పదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలి.

- సంతోష్, టెక్నీషియన్, ఆదిలాబాద్

మాపై చిన్నచూపు..

1962 సంచార పశువైద్యశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నం. నియోజకవర్గంలో ఏ గ్రామంలో పశువులకు బాగోలేకపోయిన అక్కడి వెళ్తున్నం. కానీ, మూగ జీవాలకు వైద్యం అందిస్తున్న మాపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. సేవలకు విఘాతం కలిగే అవకాశం ఉంది.

- ప్రకాశ్, కెప్టెన్, చెన్నూర్

ఊరు మందమర్రికి జీపీగా ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రిలో ఆదివాసీ సంఘాల నాయకుల పాదయాత్ర

మందమర్రి, ఫిబ్రవరి 2 : మందమర్రి మున్సిపాలిటీని రద్దు చేసి, గ్రామ పంచాయతీ కేంద్రంగా ఊరు మందమర్రి గ్రామాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్నికలు నిర్వహించాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో సంఘం మండలాధ్యక్షుడు సిద్ధం రాజేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆదివాసీ నాయక్‌పోడ్ ప్రజలు పట్టణంలో పాదయాత్ర చేపట్టారు. పాత బస్టాండ్, విద్యానగర్, రామన్ కాలనీ మీదుగా మార్కెట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఊరు మందమర్రి కేంద్రంగా గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. అనంతరం పాత బస్టాండ్ జయ శంకర్ చౌరస్తా వరకు పాదయాత్రగా వెళ్లి, అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. మందమర్రిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి, మూడు దశాబ్దాలు గడిచినా ఎన్నికలు జరుగకపోవడంతో పాలకవర్గం లేక అభివృద్ధి కుంటు పడడంతో పాటు అనే ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు పల్లె పృథ్వీరాజ్, పెద్ది భార్గవ్, లౌడం రాజ్‌కుమార్, మేసినేని అరుణ్, గంజి రాజన్న, జేక శేఖర్, కిషన్, హన్మంతు, జంగు కనకరాజు, పెద్ది రాజన్న, సేనేని మల్లేశ్, కూన సత్యం, మేసినేని నగేశ్, తిరుపతి, సంతు, రాజేశ్వరి, లలిత, దేవకి పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్ ఎస్సార్పీ 3గనిపై టీబీజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ3 గనిపై టీబీజీకేఎస్ క్యాలెండర్‌ను ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీజీకేఎస్ సాధించిన హక్కులు, డిమాండ్లతో కూడిన క్యాలెండర్ కార్మికులకు అందించామన్నారు. ఏఐటీయూసీ ఏడాదిగా కార్మికులకు ఒక్క హక్కు కూడా సాధించి పెట్టలేదన్నారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులతో పాటు, అనేక హక్కులు సాధించామని పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాలు కారుణ్య నియామకాల రూపంలో ఇచ్చి 20 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని చెప్పారు. కార్మికులకు 16 శాతం నుంచి 32 శాతానికి లాభాల వాటా పెంచి ఇచ్చినట్లు గుర్తుచేశారు. కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి పవన్ కల్యాణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, పిట్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సహాయ పిట్ కార్యదర్శి తౌటం నరేశ్, సాధుల భాస్కర్, రమణారెడ్డి, సతీశ్, తిరుపతి, శశిధర్, కార్తీక్, చల్లా ప్రశాంత్, గంగాధర్, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

కన్నాలలో పెద్దపులి సంచారం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా కన్నాల అటవీ ప్రాంతంతో పాటు బుగ్గగూడెం, లక్ష్మీపురం, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం సమీప ప్రాంతాల్లో పెద్ద పులి సంచరిస్తుండడంతో ప్రజలు సాయంత్రం 4 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లడం లేదు. కన్నాల అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా శనివారం రాత్రి రహదారిని అటవీ అధికారులు మూసివేశారు. ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా కన్నాల అటవీ శివారు ప్రాంతంలో అటవీ పెద్దపులి అడుగులను గుర్తించారు. నాలుగు రోజులుగా ఒకే ప్రాంతంలో సంచరిస్తుండడంతో వేటగాళ్ల నుంచి పులికి రక్షణ కల్పించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, బీట్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. బుగ్గ రాజరాజ్వేర స్వామి ఆలయ పరిసరాల్లో పులి తిరుగుతుండడంతో భక్తులు అటు వెపు వెళ్లడం లేదు. దీంతో రెండు రోజులుగా అర్చకులు తాళం వేసి వెళ్లిపోయారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2 : తెలంగాణాలో వయోవృద్ధుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్(టాస్క్) జిల్లా అధ్యక్షుడు పీ శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడిగా చిలివేరు సదానందంను నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. తమ అసోసియేషన్ ఏ రాజకీయ పార్టీకీ సంబంధం లేదని, స్వచ్ఛందంగా సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. వయోవృద్ధుల పోషణకు సంక్షేమ చట్టం 2007 రూల్ తప్పకుండా అమలు చేయాలని కోరారు. ప్రతీ మండలంలో సీనియర్ సిటిజన్ల కోసం డే కేర్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీ కనకయ్య, కలవేణ సమ్మయ్య, కే నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

వైకుంఠధామం పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 2 : మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. తీరును అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, గడువులోగా పనులను పూర్తిచేయాలని, నాణ్యత విషయంలో రాజీపడవద్దని సూచించారు. మహాశివరాత్రి రోజున వైకుంఠధామం ప్రారంభించాలని, అందుకు అనుగుణంగా అధికారులు పనులు పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

లేక్ వ్యూ రెస్టారెంట్ పరిశీలిస్తున్న అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ, జేడీఎం నాగభూషణం

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ–ఉట్నూర్ ఆధ్వర్యంలో ఆదివారం అడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన లేక్ వ్యూ రెస్టారెంట్‌ను జేడీఎం నాగభూషణం, ఆసిఫాబాద్ వెలుగు మహిళా మండల సమాఖ్య ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ.. లేక్ వ్యూ రెస్టారెంట్ పరిధిలో ఆసిఫాబాద్ వెలుగు మండల మహిళా సమాఖ్య ద్వారా వీవోఏ భీమన్న ద్వారా ఐదుగురు మహిళలతో జాయింట్ లయబులిటీ గ్రూప్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రయాణికులు, పర్యాటకులకు వివిధ రకాల స్నాక్స్, టీ అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ అభ్యర్థుల సందర్శన

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 2 : మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్ గ్రూప్ ఏ లో నూతనంగా నియామకమైన అభ్యర్థులు శిక్షణలో భాగంగా ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామాన్ని సందర్శించారు. 5వ తేదీ వరకు గ్రామంలో బసచేసి, పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. నీటి సౌకర్యం, విద్యా సౌకర్యం, ప్రభుత్వ పథకాలు, పారిశుద్ధ కార్యక్రమం, వ్యవసాయ స్థితి గతులపై అధ్యయనం చేయనున్నట్లు అభ్యర్థులు తెలిపారు. వీరు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం (ఎంసీహెచ్ ఆర్డి)లో శిక్షణ పొందుతున్నారు. వీరితో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ అభ్యర్థులతో ఎంపీడీవో రాజేశ్వర్

ఆశయం, ఆలోచన గొప్పగా ఉండాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 : విద్యార్థుల ఆశయం, ఆలోచన గొప్పగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ జయసింహ పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధానికి ముందే ఓటమి అంగికరించకూడదని, మొదటి స్థానం తమదేనని నమ్మి ముందుకుసాగాలని, ఆశయం ఉన్నతంగా ఉన్నప్పుడు కార్యాచరణ కూడా ఉన్నతంగానే ఉండాలని సూచించారు. కరెస్పాండెంట్ సురవర్ధన్, ప్రన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : శాసనమండలి ఎన్నికల దృష్ట్యా అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉంటున్నందున ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిలాల ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేసుతన్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

పవన్ కల్యాణ్ (ఫైల్)

కోటపల్లి, ఫిబ్రవరి 2 : షేర్ మార్కెట్‌లో డబ్బు పోగొట్టుకున్న చెన్నూర్ పట్టణం మహంకాలివాడకు చెందిన మాదాసు పవన్ కల్యాణ్ (24) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మాదాసు రాజేశ్వరి–రాజన్న కొడుకు పవన్ కల్యాణ్ చెన్నూర్‌లోని ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. ఉదయం బట్టల దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పి, తన అమ్మమ్మగారి ఊరైన కోటపల్లి మండలం రాంపూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి కొద్ది సేపటికి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వచ్చి కూర్చోగా నోట్లో నుండి నురగలు రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించి, వెంటనే 108 అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వ దవాఖాకు తరలించారు. కాగా, పవన్ కల్యాణ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పవన్ కల్యాణ్ షేర్ మార్కెట్‌లో డబ్బు పెడుతూ ఉండేవాడని, పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకోవడంతోనే కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 3 : కాగజ్‌నగర్ మండలం విలేజ్‌నంబర్ 12 సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడి, దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన శంకరయ్య (58) మృతిచెందినట్లు ఏఎస్ఐ హీరామన్ తెలిపారు. శంకరయ్య, తన భార్య లక్ష్మి, అత్తయ్య శోభ శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడకు శుభకార్యం కోసం వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తా పడడంతో శంకరయ్య మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగతా వారికి స్వల్పగాయాలయ్యాయి. శంకరయ్య కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు..

హాజీపూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని సబ్బెపల్లి గ్రామ శివారు అనంతశ్రీకాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. తెలిసిన వివరాల ప్రకారం.. లక్షెట్టిపేట నుంచి మంచిర్యాలకు బైక్ వస్తున్న సంతోష్‌ను మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న బొలేరే వాహనం ఢీ కొట్టింది. దీంతో సంతోష్ తలకు తీ